ప్రజాశక్తి

విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, తదితర అధికారులు

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఈనెల 15 నుంచి చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణబాబులతో కలసి తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాలంటీర్లు, గహ సారథులు, ప్రజాప్రతినిధులు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఇంటింటికీ తిరిగి ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహిస్తారన్నారు. 30న రాష్ట్రవ్యాప్తంగా, మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్న సమావేశంలో రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమస్యలు తీర్చడానికి మరొక వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా జరగనున్న వివిధ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, ఆరోగ్యశ్రీ పథకంపై కూడా విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఎఎన్ఎంలు ఆరోగ్య పరిస్థితుల జాబితాను సమర్పించాల్సి ఉందన్నారు. మెడికల్ క్యాంపులలో వారికి మెరుగైన సేవలు అందించవచ్చు అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు ఎంపీడీవోలు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఐసిడిఎస్ విద్య, పంచాయతీ, వార్డు సచివాలయాలు తదితర శాఖలన్నీ సమన్వయంతో సహకరించి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో నిర్వహించిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, డీఈవో మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిఐఒ డాక్టర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు..!

సామన్య ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సాయం అందించాల్సిన అధికారులూ, సిబ్బందే తప్పిదం చేశారు. అది కూడా సరిదిద్దుకోలేనంత తప్పను చేసేశారు. ఆ తప్ప ఓ విద్యార్థిని జీవితాన్ని అంధకారంలోకి నెట్టేసింది. బతికున్న యువతిని ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు చేశారు. దీంతో ఆ విద్యార్థిని ఉన్నత చదువుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారుల తప్పిదాలు సామాన్యులకు ఎంతటి శిక్షను విధిస్తాయి అనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. అభం, శుభం తెలియని ఓ విద్యార్థి జీవితం అంధకారంలో పడేసేలా ప్రభుత్వాధికారుల నిర్వాకం కొనసాగింది. సరిదిద్దుకోలేనంత పెద్ద తప్పచేసి ఇప్పడు తామేమీ చేయలేమంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ తప్ప తమ పరిధిలో జరగలేదంటే, తమ పరిధిలో జరగలేదంటూ నెపాన్ని ఒకరిపై ఒకరు నెట్టేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారుల తప్పిదానికి బలైన ఆ విద్యార్థిని ఇంటర్ చదువుకు దూరం అయ్యి ఇంటి వద్దనే మిగిలిపోవాల్సిన దుస్థితి నెలకొంది. 'తాను బతికున్నాను మహాప్రభో.. నాకు న్యాయం చేయండి'.. అంటూ ఆ విద్యార్థిని అధికారులను కన్నీటితో వేడుకుంటోంది.

- ◆ అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థి జీవితం నాశనం..
- ◆ బతికుండగానే చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు
- ◆ ఇంటర్ ప్రవేశానికి అర్హత కోల్పోయిన విద్యార్థిని
- ◆ 'చదువుకోవాలనుంది న్యాయం చేయండి' అంటూ వేడుకోలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ బరకతుల్లా కుమార్తె ఎస్.కౌసర్. చదువుపై కూతురికి ఉన్న ఆశక్తిని గమనించిన బరకతుల్లా ఆమెను ప్రోత్సహించాడు. తండ్రి ప్రోత్సాహంతో కౌసర్ చిలమత్తూరు ఉర్దూ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసింది. 8 నుంచి 10వ తరగతి వరకు ఈ విద్యార్థిని చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. 10వ తరగతిలో 361 మార్కులతో మెదటి శ్రేణి తరగతిలో ఉత్తీర్ణురాలు అయ్యింది.

ఇంటర్‌కు 'నో ఎంట్రీ'

పదిలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలు అయిన కౌసర్ ఇంటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఇక్కడే వీరికి అసలు సమస్య ఎదురైంది. ఈ విద్యార్థిని ఆధార్ నెంబర్‌పై చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో చూపుతుండడంతో ఏ కళాశాలలో కూడా అడ్మిషన్ పొందేందుకు వీల్లేకుండా పోయింది. దరఖాస్తు నో ఎంట్రీ పేరుతో వస్తోంది. గత నెల 30వ తేదీ లోపు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌కి అవకాశం ఉండేది. ఇంటర్‌లో చేరేందుకు తప్పనిసరిగా ఆధార్‌తో ముడిపడి ఉండడంతో విద్యార్థినికి ఏ కళాశాలలోనూ సీటు రాలేదు. దీంతో ఆమె చదువు ఆగిపోయింది. కుటుంబ సభ్యులు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తిరిగినా ఎలాంటి ప్రయోజనం లభించలేదు.



విదార్థిని ఆధార్ కార్డు

బతికుండాగానే చంపేశారు..!

కౌసర్ 8 తరగతి చదువుతున్న సమయంలో అమ్మఒడి కోసం పాఠశాలలో దరఖాస్తు చేసుకుంది. అయితే ఆమెకు అమ్మఒడి వర్తించలేదు. ఇదేమిటని తండ్రి ఆరా తీయగా విద్యార్థిని ఆధార్ నెంబర్(359665371816) చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామంలోని ఓ ఇంటికి సంబంధించిన రేషన్ కార్డుకు అనుసంధానం అయ్యింది. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఏఈపీడీఎస్ సర్వే సమయంలో డెత్ అని ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. శెట్టిపల్లి గ్రామంలో ఈసర్వే జరుగుతున్న సమయంలో ఆ కార్డులో ఉన్న కౌసర్ అప్పటి సర్వే అధికారులు డెత్(చనిపోయినట్లు)గా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో ఈ విద్యార్థినికి అమ్మఒడి వర్తించలేదు. డెత్‌గా ఉన్న తన కూతురి పేరును మార్చుకునేందుకు తండ్రి మండల, జిల్లా స్థాయి అధికారులను అనేక సార్లు కలిసి అర్జీలను అందజేశాడు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో చేసేది లేక అమ్మఒడి రాకపోయిన పర్వాలేదు తన కూతురు చదువుకుంటే చాలు అని ఆయన బిడ్డను పాఠశాలకు పంపాడు. ఇలా ఈ ఏడాది కౌసర్ పదిలో 361 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది.

అసలు తప్పు ఎవరిది.?

ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వే సందర్భంగా వాలంటీర్, వీఆర్వోలు చేసిన తప్పిదానికి ఓ విద్యార్థి భవిష్యత్తు నాశనం అయ్యింది. సాధారణంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఏఈపీడీఎస్ రేషన్ షాపు వద్ద ముందు వాలెంటీర్‌లు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో రేషన్ కార్డుల్లో ఉండి మరణించిన వారిని కార్డుల నుంచి తొలిగించారు. ఇందుకు పెద్ద ప్రక్రియే ఉంది. తొలుత వాలంటీర్లు డెత్ అయినట్లు నమోదు చేస్తారు. తర్వత దానిని వీఆర్వో సర్వే చేసి నిజమేమని పరిశీలించిన అనంతరం ధ్రువీకరిస్తారు. ఆ తర్వాత తహశీల్దార్ లాగిన్‌కు వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ధ్రువీకరిస్తేనే అది డెత్ కింద నమోదు అవుతుంది. తరువాత రేషన్‌కార్డు నుంచి తొలిగించబడుతుంది. ఈ మూడు స్థాయిల్లో గుర్తించాల్సిన అధికారులు విద్యార్థిని కౌసర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విషయం స్పష్టంగా అర్థం అవుతోంది.

బాధిత విద్యార్థిని కౌసర్

సచివాలయం ద్వారానే పరిష్కారం

బతికుండగానే విద్యార్థిని చనిపోయినట్లు నమోదు అవడం గ్రామ సచివాలయ పరిధిలోనే తప్పు జరిగింది. దీనికి సచివాయంలోనే పరిష్కారం చూపే అవకాశం ఉండొచ్చు. ఆ మేరకు గ్రీవెన్స్‌లో దీనిపై బాధితులు ఫిర్యాదు చేయాల్సి ఉంది. విద్యార్థి చదువుకు దూరం కావడం బాధాకరం. దీనిని ఎలా పరిష్కారం చేయాలన్న విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యార్థికి న్యాయం చేస్తాం.

నాగరాజు, తహశీల్దార్.

చదువుకుంటా..న్యాయం చేయండి..!

నాకు చదువుకోవాలని ఉంది. ఆధార్‌కార్డులో చనిపోయినట్లు ఉండడంతో ఇంటర్‌లో అడ్మిషన్ పొందలేకపోతున్నాను. దీనిపై అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి. మా నాన్న ఆటో డ్రైవర్ కావడంతో కార్యాలయాలకు తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. కావున అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించి నాకు చదువుకునేందుకు అవకాశం కల్పించాలి.

ఎస్.కౌసర్, విద్యార్థిని.

కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ పరిశ్రమ కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం న్యాయం చేయక పోతే పారిశ్రామిక వాడను స్తంభింపజేస్తామని సిఐటియు నాయకులు రాము, ఎఐటియుసి వినోద్ కుమార్, ఒపిడిఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి అన్నారు. గురునానక్ కార్మికులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు చేస్తున్న ఆందోళనలు బుధవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని కార్మిక శాఖ అధికారి కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎల్ఓ రమణ రెడ్డికి వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నౌషాద్, ముత్యాలప్ప, సురేష్, కమల్ భాష, ఈరప్ప, బషీర్, దాదాపీర్, హనీఫ్‌తో పాటు గురునానక్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు చాంద్‌బాషా, రమేష్, శ్రీనివాసులు, సతీష్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారికి వినతిని ఇస్తున్న సిఐటియు, కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

ఓటర్ల తుదిజాబితా రూపకల్పనకు చర్యలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎటువంటి లోపాలు, తప్పులకు ఆస్కారం లేకుండా ఓటర్ల తుది జాబితా తయారీకి తగిన చర్యలు చేపడుతున్నామని ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమ్మర్ రివిజన్ 2024లో భాగంగా చేయాల్సిన కార్యక్రమాలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వే జరిగిందని వారి దృష్టికి వచ్చిన క్లైములు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఇంతవరకు వచ్చిన మతి చెందిన, సిట్టింగ్ అయిన క్లైమ్‌ల గురించి మరొకసారి పరిశీలించనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన ఉండాలన్నారు. ఏజెంట్లకు ఈ విషయమై స్పష్టత ఉండాలన్నారు. జిల్లాలో ఫారం 6లో 51 శాతం పెండింగ్‌లో ఉందన్నారు. వీటిపై సమగ్ర పరిశీలన చేస్తున్నామన్నారు. ఈనెల 15, 16వ తేదీలలో ఆయా నియోజకవర్గాల గుర్తించిన పోలింగ్ స్టేషన్ల విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలుపుతామన్నారు. ఈనెల 20న మరొకసారి రాజకీయ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మికులు, నాయకులు

ధర్మవరంలో ఈనెల 28,29 తేదీలలో జరిగే మున్సిపాలిటీ ఉద్యోగ, కార్మికసంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల ప్రధానకార్యదర్శి అయూబాన్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న పిలుపు నిచ్చారు. ఈ మేరకు సిఐటియు కార్యాలయం వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమున్సిపల్ ఉద్యోగ, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వంలో చలనం రాలేదన్నారు. హెల్త్ ఆలవెన్స్, పీఆర్సీ సంక్షేమపథకాలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, నాగార్జున, వెంకటస్వామి, హరి, మున్సిపల్ రెగ్యులర్ కార్మికసంఘం అధ్యక్షుడు శ్రీరాములు, కార్మికసంఘం నాయకులు చెన్నకేశవులు, బాబు, పుల్లన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి -పెనుకొండ

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూల్ లో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ రాష్ట్ర వర్క్‌షాప్‌నకు సంబందించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ట్రాన్స్ పోర్ట్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా పట్టణంలోని ఆటో కార్మికులతో కలసి ఆటో స్టాండ్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పెడబల్లిబాబా మాట్లాడుతూ పాలకులు రవాణా రంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం కర్నూల్ లో రెండు రోజుల పాటు జరిగే వర్క్ షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి ,ఆటో యూనియన్ నాయకులు రవినాయక్, మహేష్, నారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి గాండ్లపెంట

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకుడు సాంబశివ, రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, ఖాదర్ బాషా, గంగన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఇఒఆర్‌డి కుర్చీ వద్ద నేలపై కూర్చొని నినాదాలు చేశారు. సంవత్సరం నుంచి పారిశుధ్య కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పలుసార్లు అధికారులు తెలిపిన ప్రయోజనం కన్పించలేదని అన్నారు. స్పందించిన ఇఒఆర్‌డి సునీత ఈ నెలాఖరులోపు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు ఎం అక్కులప్ప, కె నరసింహులు, గంగులప్ప, ఎం ఆంజనేయులు, మస్తానప్ప కదిరప్ప, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - లేపాక్షి

హిందూపురం డివిజన్ పరిధిలో చేపట్ని రైతుభరోసాకేంద్ర భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు .రమణారెడ్డి, డిఇ హరి ప్రసాద్ ఆదేశించారు. నూతన రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాల గురించి బుధవారం మండలకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం డివిజన్ పరిధిలో ని రైతు భరోసా భవన నిర్మాణాలను అక్టోబర్ నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీ ఖాన్, లేపాక్షి చిలమత్తూరు, పరిగి, గోరంట్ల, హిందూపురం మండలాల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కక్షతోనే బాబుపై కేసు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణపై నోరు జారి మాట్లాడితే సహించేది లేదని కక్ష సాధింపు కోసమే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించాలని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో టిడిపి నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. బాలకృష్ణపై వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మినారాయణ, దేమకేత పల్లి అంజినప్ప, రామాంజమ్మ, మాజీ మున్సిపల్ చైర్మేన్ అనీల్ కుమార్, శివ శంకర్, షఫివుల్లా, రమేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మట్కా కేసులో సబ్ జైలుకు వెళ్లారన్నారు. ఇన్‌చార్జ్ గా చెప్పుకుంటున్న దీపిక వలస వచ్చి రెండు నెలలు అయిందన్నారు. వీరు బాలయ్య బాబుపై మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో అసుపత్రికి అవసరమైన పరికరాలు, మందులు, ప్రజల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య రథం, అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. 2019లో మీరు అధికారంలో వచ్చాక ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఈ విషయంపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. చంద్రబాబు అరెస్టు విషయంలో మంత్రులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హయాంలో హిందూపురం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఆయన నియోజకవర్గంలో పేదల వైద్యసేవల కోసం పెద్దమొత్తంలో సొంతంగా ఖర్చు పెడుతున్నారని గుర్తు చేశారు. అలాంటి తమ నాయకుడిపై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన అవినీతి రాజ్యమేలుతోందన్నారు. వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారని అన్నారు. ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాము, అమర్నాథ్, రాఘవేంద్ర, పూలకుంట సర్పంచి మంజూనాథ్, ఆదినారాయణతో పాటు అధికసంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందనిప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కేశవులు, రామచంద్ర రావు అన్నారు. బుధవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన అఖిల భారత చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య సౌజన్యంతో చిన్న పిల్లల వైద్యులచే విద్యార్థుల ఆరోగ్యంపై వారి స్థాయికి తగిన విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు, డాక్టర్ రామచంద్ర రావు, కీర్తి, గురు వరుణ్ మాట్లాడుతు మారుతున్న సమాజంలో ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. అసహజ రుచికరమైన ఆహారానికి దగ్గరవుతూ జీవిస్తున్నామన్నారు. ఈ జింక్ ఫుడ్‌ను ఎక్కువగా చిన్నారులు వాడుతున్నారన్నారు. ఇందులో పోషక విలువలు లేని అధిక ఉప్పు, అధిక తీపి, అధిక క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం డాక్టర్ల బందం విద్యార్థులచే ఆరోగ్యకరమైన, సహజ సిద్ధమైన ఆహారం తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు, నృత్యం, కూరగాయల వేషధారణ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులతో వైద్యులు, పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు

ఎట్టకేలకు ఐఎబి

హెచ్ఎల్‌సి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఎట్టకేలకు ఖరారైంది. గురువారం ఉదయం జిల్లా పరిషత్ డిపిసి హాలులో ఈ సమావేశం జరగనుంది. సెప్టంబర్‌తో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో ఈ సమావేశం జరగనుంది. సాధారణం ఆగస్టు మొదటి వారంలోనే ఈ సమావేశం నిర్వహించేవారు. ఇక్కడ తీసుకున్న నిర్ణయాల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతాయి. కాని ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగు, తాగునీటి కష్టాలు అధికంగానే ఉన్నాయి. అయితే తుంగభద్ర డ్యామ్‌కూ నీరు ఆలస్యంగా రావడంతో నీటి విడుదల్లోనూ కొంత జాప్యం జరిగింది. ఇక ఐఎబి సమావేశం కూడా ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో జరుగుతుండటం గమనార్హం.

ఆయకట్టు రైతులకు తప్పని ఇబ్బందులు

ఆయకట్టు రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ఆయకట్టే నీరందక నార ముదిరిపోయి పంట వేసుకోలేని పరిస్థితి నెలకొంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ కింద ఇదే పరిస్థితి నెలకొంది. డిస్ట్రిబ్యూటరీలకు పూర్తి స్థాయి నీరు లేక వరి పంటకు నీరందటం లేదు. ఇక మిడ్ పెన్నార్ దక్షిణ కాలువకు నీరు ఎప్పుడు అందుతుందో లేదో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. హంద్రీనీవా రైతుల పరిస్థితి అయోమయంగానే ఉంది. శ్రీశైలం డ్యామ్‌కు పుష్కలంగా నీరు రాలేదు. ఎప్పుడు వస్తాయో ఎప్పుడూ నీరు ఆగిపోతుందో తెలియక ఆయకట్టు రైతులు పంటలు సాగు

సీజన్ ముగుస్తుందనగా సమావేశం
ఆయకట్టు రైతులకు ఇప్పటికే ఇక్కట్లు

చేసుకోవాలో లేదో తెలియకుండా ఉంది. ఒక వైపు వర్షాభావ పరిస్థితులు మరోవైపు ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొన్నాయి.

కాలువలు ఎక్కడి పరిస్థితి అక్కడే

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. ఆధునీకరణ పనులు మధ్యలో ఆపివేసియున్నారు. నాలుగేళ్లుగా కనీసం నిర్వహణ కూడా నోచుకోలేదు. ఎప్పుడు గండిపడుతుందోనన్న గుబులు అధికారుల్లో ఉంది. ఈ ఏడాది వరుసగా మూడుసార్లు కాలువకు గండిపడింది. అసలే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి ఈ సమయంలోనూ పూర్తి స్థాయిలో నీటిని తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది పుష్కలంగా నీరొచ్చినా నిలువ చేసుకునే సామర్థ్యం లేక వృథాగా నదిలోకి వంద టిఎంసిల వరకు వెళ్లింది. ఇక హంద్రీనీవా ఆధునీకరణ చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. గత ఐఎబి సమావేశాల్లో ఈ అంశాలపై నేతలు చర్చించారు. ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కాని ఇప్పటికీ పనులు ప్రారంభమవలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. ప్రతి సమావేశంలోనూ నేతలు ప్రాంతాల వారీగా విడిపోయి నీటి కోసం వాదనలు చేసుకోవడం మినహా శాశ్వత పరిష్కారానికి తీసుకున్న చర్యలేవి ఉండటం లేదు.

నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నల్లచెరువు : మండల కేంద్రంలోని విజయలక్ష్మి కాలనీ నందు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 20 లక్షలతో చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే సిద్ధారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచి పంచరత్నమ్మ, ఎంపీటీసీ సుమియా, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన 317 పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో 105 పింఛన్లు మంజూరు కాగా పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి రాధా నాగరాజు, సింగిల్ విండ్ అధ్యక్షులు నాగభూషణ, వైసీపీ నాయకుడు వాల్మీకి శంకర్ వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రఫీ, వైసిపి నాయకులు బళ్లారి బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : నూతనంగా మంజూరైన పింఛన్లను మండలంలోని పలు సచివాలయాల్లో బుధవారం పంపిణీ చేశారు బత్తలపల్లి 32, బత్తలపల్లి లో జడ్పిటిసి కోటి సుధా, అప్రా చెరువులో ఎంపీపీ బగిరి త్రివేణి, ఓబులాపురంలో సర్పంచి బండి సరస్వతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయపిరెడ్డి, బండి వీరానారప్ప, సచివాలయాల కన్వీనర్ జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సిద్దా రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. మండలానికి సంబంధించి 238 నూతన పెన్షన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని కమ్మవారిపల్లి సచివాలయం పరిధిలో మంజూరైన నూతన పింఛన్లను సర్పంచి చాపట్ల మణి శివశంకర్ రెడ్డి, ఎంపిటిసి సిరగం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రొద్దం : రొద్దం పంచాయతీకి మంజూరైన పింఛన్లను బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి, సర్పంచి చేతుల మీదుగా లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర శేఖర్, వైసిపి రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జెట్టి మారుతిరెడ్డి, జెట్టి అంజనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లను మండల పరిధిలోని కొక్కంటి సచివాలయంలో ఎంపీపీ వైవి కౌసల్య, బాలసముద్రం ఎంపీటీసీ అమర్ కార్తికేయ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : లబ్ధిదారులకు మంజూరైన పింఛన్లను కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్ల పల్లి గ్రామ సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ ముట్టడి

పుట్టపర్తి క్రైమ్ : జిల్లాలోని దళిత వాడలలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 25న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. ఈమేరకు ఆ సంఘం రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి హెచ్. అక్కులప్ప మాట్లాడుతూ కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేచాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.సి.గంగాద్రి ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలోని గణేష్ సర్కిల్ లో కలెక్టరేట్ ముట్టడికి సంబంధించి గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దనరసింహులు, సుంకన్న , సంపత్, జి.గంగాధర, ఎన్. రెడ్డప్ప, జానకిరామ్,రమేష్ బాబు, వరదరాజులు, రామాంజనేయులు,సాకే జయరాం, పాల్గొన్నారు.

'పివిఎస్'లో స్కూల్ లీడ్ పోటీలు

ముదిగుబ్బ : స్థానిక పివిఎస్ పాఠశాలలో బుధవారం స్కూల్ లీడ్ కాంపిటీషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పివి నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి పరిశీలనా సామర్థ్యాన్ని, అవగాహన శక్తిని పెంపొందింపజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బెహలూల్ షా ఖాద్రీ గంధం ఉత్సవాలు

పెనుకొండ : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న బెహలూల్ షా ఖాద్రి దర్గా 826వ గంధం మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి షెక్షావలి భక్తులు, ప్రముఖులతో కలిసి గంధంను స్వామి కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర ,హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, పెనుకొండ ఎజిపి ఎం.భాస్కర్ రెడ్డి ,హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రోషన్ ఆలీ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రఘువీరారెడ్డి, తదితరులు

ప్రజాశక్తి మడకశిర

విద్యార్థులు విద్యతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉదయ భాస్కర్, సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి సూచించారు. శ్రీరామి రెడ్డి 118వ జయంతి సందర్భంగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన తాలుకా స్థాయి క్రీడా పోటీలను మండలంలోని నీలకంఠాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు నీలకంఠాపురంలో ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించడం వల్ల క్రీడాకారుల దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలోని 64 పాఠశాల నుండి విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారని తెలియజేశారు. దాదాపు 15 రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని గెలుపొందిన విద్యార్థులకు అక్టోబర్ ఆరవ తేదీన బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి బ్యాటింగ్ చేయగా క్రీడల అధికారి ఉదయభాస్కర్ బౌలింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్, మందలపల్లి నాగరాజు, సర్పంచులు కళావతి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నరసింహమూర్తి, ప్రభాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, హెడ్మాస్టర్లు చంద్రమౌళి, రంగస్వామి, రామకృష్ణ నియోజకవర్గంలోని పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

ప్రజాశక్తి మడకశిర రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేశంలో మరెక్కడ లేనివిధంగా మన రాష్ట్రంలో పంటల సాగులో రైతులు నూతన పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు పొందుతున్నారని టీటీడీ బోర్డు మెంబర్, మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మడకశిర మార్కెట్ యార్డ్ లో బుధవారం పకతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ ఎస్టీ రైతులకు పదివేల రూపాయలు విలువచేసే సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రమణారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన వంద శాతం పూర్తి : ఆర్డీవో

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం వంద శాతం పూర్తి అయిందని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ పేర్కొన్నారు. స్పెషల్ సమ్మర్ రివిజన్ – 2024లో భాగంగా పుట్టపర్తి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నియాజకవర్గ రెవిన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్పెషల్ సమ్మర్ రివిజన్ – 2024లో భాగంగా నియాజకవర్గం లో ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ వంద శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రీ వెరిఫికేషన్ కోసం మండలానికి ఒక్క స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలని తెలిపారు. ఈసమావేశంలో మునిసిపల్ కమిషనర్ మధుసూదన రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కరపత్రాలను అందజేస్తున్న దీపిక వేణు రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అర్హులైన ప్రతి ఒక్కరు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డులోని కృష్ణ లేఅవుట్, లక్ష్మీపురం ప్రాంతాల్లో గడప డగపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వసంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకట రమణ, డిఇఇ బాల సుబ్రమణ్యం, కౌన్సిలర్లు జయప్ప, షాజియా, వైసిపి నాయకులు శ్రీరామి రెడ్డి, కవిత, డిష్ చాంద్, ఇలియాజ్, సోమశేఖర్ రెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ : పట్టణంలోని10వ వార్డు సచివాలయాన్ని ఇన్‌చార్జ్ దీపిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

నాణ్యతగా సిమెంట్ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - బత్తలపల్లి

గ్రామాలలోని కాలనీలలో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్లను నాణ్యతగా చేపట్టాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, వైసిపి మండల కన్వీర్ బగ్గిరి బయపరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోట్లమర్రి పంచాయతీ పరిధిలోనిగంటాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 12 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వారు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయపరెడ్డి తో పాటు పోట్లమర్రి సర్పంచి అక్కిం దామోదర్, సంద్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి లోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు గురువారం ముగిసాయి. మండల విద్యాధికారి చాముండేశ్వరి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి అధ్యక్షతన మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన దాదాపు 30 మంది క్రీడాకారులను మండల స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయికి ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సువర్ణ, లక్ష్మీనారాయణ, లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వినాయక పండుగ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లాలో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహం, మండపాల ఏర్పాటుకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించే కమిటీ వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలని తెలిపారు. పాటించవలసిన నియమ నిబంధనలుచ తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు గురించి ఎస్పీ వివరించారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్ళు/మండపాల ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలపాలని, గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతులు తీసుకోవాలని అన్నారు. ప్రయివేటు, పంచాయతీ, మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే వారు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వారితోపాటు చుట్టుపక్కల నివసించే వారి సమ్మతి కుడా పొందాలన్నారు.అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని, వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళ ,,మండపాల వద్ద ఇసుక, నీటిని ఏర్పాటు చేసుకుని ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశము , విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విరిగా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు తెలియజేయాలన్నారు. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలన్నారు. భద్రత కొరకు రాత్రి సమయాలలో మండపాల వద్ద ఉత్సవ కమిటీ వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయాలలో ఎక్కడ కులాలు, మతాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయరాదన్నారు. విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో ,రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామాగ్రిని పేల్చడం చేయరాదన్నారు. పందిళ్ల వద్ద, ఊరేగింపు సమయాలలో మద్యం లేదా మత్తు పదార్థాలను వాడిన వారు ఆ ప్రాంతంలో లేకుండా ఉండే విధంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రద్దీని నివారించేందుకు, భద్రత కొరకు తగినంత మంది వాలంటీర్లను ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉత్సవ కమిటీ కార్యనిర్వాహకులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.. మండ్లిపల్లి గ్రామానికి చెందిన నరసింహులు (38) ద్విచక్ర వాహనంలో వెళుతూ ఎదురుగా వస్తున్న జెసిబి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో సంచార పశు వైద్యశాల వాహనంలో డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. ఎప్పటిలాగానే బుధవారం విధుల్లోకి వెళ్లడానికి ఇంటినుంచి బయలుదేరి ప్రమాదానికి గురయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.

పలువురు నివాళి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరసింహులు మృతదేహాన్ని టిడిపి నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. మండల మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, సీనియర్ నాయకులు మహబూబ్ బాషా, లాలూ సాబ్, బీసీ సెల్, శంకర్ నాయుడు, ఎస్సీ సెల్ చిన్నప్ప తదితరులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం

కదిరి అర్బన్ : గ్రామీణ ప్రాంత ప్రజల శాంతి భద్రతలు కాపాడేందుకు అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

మజ్దూర్ యూనియన్ నాయకుల సంబరాలు

కదిరి టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్‌కు ప్రత్యేక గుర్తింపు లభించడంతో కదిరి డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ సభ్యులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు గుర్తింపు పత్రాన్ని డిపో మేనేజరుకు అందజేసారు. ఈ కార్యక్రమములో డిపో అధ్యక్షులు రామక్రిష్ణ, సెక్రటరీ బైరిశెట్టి, చైర్మన్ నారాయణ స్వామి, వెంకటప్ప, ప్రభాకర్ రెడ్డి, సాదిక్,పులి శ్రీనివాసులు, రహిమాన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ రాధిక అన్నారు. కదిరి రూరల్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని అంగన్వాడీకేంద్రంలో బుధవారం పౌష్టికార మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఒ మాట్లాడుతూ పౌష్టికాహారం వల్ల గర్భిణులకు, బాలింతలకు, కిషోరబాలికలకు, చిన్నారులకు కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, జిఎంఎస్ పర్వీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని డిఎల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సృజన్స్ క్లినిక్‌ను వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి అనీల్ కుమార్, వైద్యులు సుజన్, బావ వికసిత, వార్డు కౌన్సిలర్ నాగేంద్ర బాబు, సందీప్, సిపిసి సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

కదిరి అర్బన్ : ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వాలంటీర్లు గడపగడపకు వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి అవసరమైన వైద్య చికిత్సలు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఈ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించాలని కోరారు.

నిరసన దీక్షను విజయవంతం చేయండి

కనగానపల్లి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, రిమాండ్ కు నిరసనగా రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదురుగా మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో చేపట్టే రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర నాయకులు నెట్టం వెంకటేష్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మండల నాయకులతో కలిసి సభ ప్రాంగణాన్ని పరిశీలించారు కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాల నరసింహులు, సీనియర్ నాయకులు ముకుందనాయుడు, ఎంపిటిసి బిల్లే భాస్కర్, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, సరిపుటి బాలయ్య, పూజారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా గోరంట్ల పట్టణంలో చేపట్టే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన తన నివాసంలో బుధవారం కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు విడుదల కోసం కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గురువారం నిర్వహించే రిలే నిరాహార దీక్షకు ప్రతి గ్రామం నుండి తరలిరావాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, టౌన్ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, బాలకృష్ణ చౌదరి, ఎల్ఎన్. నారాయణస్వామి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

మడకశిర : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారము నుండి ఒక్కోమండలం నుండి 500 మందితో నియోజకవర్గ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. మండలం మున్సిపాలిటీలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పాల్గొననున్నారని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పట్టణ కన్వీనర్ మనోహర్ తెలిపారు.

వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

బుక్కపట్నం : వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలు మండల పరిధిలో ఏర్పాటు చేయడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ నరసింహుడు తెలిపారు .ఉత్సవాలు నిర్వహించేవారు ఒక కమిటీగా ఏర్పడి పోలీసు అనుమతి తీసుకోవాలని చెప్పారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం : టిడిపి

ప్రజాశక్తి -పెనుకొండ

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అరెస్టు అక్రమమని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సామూహిక రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం పరిశీలకులు నరసింహ యాదవ్, నాయకులు కురుబ కృష్ణమూర్తి, రొద్దం నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, మునిమడుగు చిన్న వెంకటరాముడు, రఘువీర చౌదరి, తదితరులు పాల్గొన్నారు. రిలే దీక్ష కు సిపిఐ జిల్లా అధ్యక్షులు వేమయ్య యాదవ్, కాటమయ్య, శ్రీరాములు తదితరులు నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారన్నారు.ఈ బుద్ధిలేని జగన్ కు రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు న్యాయవాదులు శరత్, రాజేష్ నాయక్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, టౌన్ కన్వీనర్ రవి శంకర్, బోయ గాయిత్రి, నాగమణి, అనసూయమ్మ, రామకృష్టప్ప, చిన్నప్పయ్య శ్రీనివాసులు,రామలింగ,నాగరాజు, గొందిపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పైశాచిక ఆనందం కోసం వ్యవస్థలన్నిటిని సర్వనాశనం చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ ఆరోపించారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా 'మేము సైతం బాబు'తో కార్యక్రమంలో భాగంగా కదిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కందికుంట వెంకటప్రసాద్ తన సతీమణి యశోదా దేవితో కలిసి రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జగన్ చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేక కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. నేరారోపణ రుజువుకాకుండా 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసినటువంటి వ్యక్తిని అరెస్ట్ చేసిన విధానం దుర్మార్గమన్నారు. జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్ట్ కు వ్యతిరేకంగా అహింస పద్ధతిలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. సాయంత్రం ఐదు గంటలకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మోపురిశెట్టి చంద్రశేఖర, డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్ బాబు, బండారు మనోహర్ నాయుడు, గంగయ్య నాయుడు, కృష్ణమూర్తి, మహిళా నాయకురాలు పర్వీన్ భాను, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి

ముదిగుబ్బ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం రాత్రి టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబునాయుడిని అరెస్టు చేయడం అన్యాయమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'బాబుతోనే నేను' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. పరిటాలశ్రీరామ్ చేపట్టిన దీక్షకు జనసేన, ఎమ్మార్పీఎస్, విద్యార్థిసంఘాలనాయకులు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును దేశవ్యాప్తంగా వ్యతిరేకత కనపడుతోందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రతి పైసాకు లెక్కచూపిస్తామని అధికారులు అంటున్నారంటే వాటిని ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ దీక్షలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కదిరిలోని నిరసన దీక్షలో కందికుంట దంపతులు, ఇతర నాయకులు